
సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 17 । మే । 2023



పరిసరాల పరిశుభ్రత..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని కలెక్టర్ అన్నారు. శ్రీకాకుళంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. - 8లో



పారిశ్రామిక శిక్షణ

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 3676 సీట్లు అందుబాటులో ఉన్నాయి. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	40°	30°
ఇచ్ఛాపురం	39°	29°
పాతపట్నం	39°	29°
శ్రీకాకుళం	40°	29°

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సు ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ సీహెచ్ ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15తో ముగియగా, అభ్యర్థుల సూచనల మేరకు దరఖాస్తు స్వీకరణకు గడువు పెంచినట్లు వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లకు కోర్సులో ప్ర వేశాలకు ప్రాధాన్యత నివ్వనున్నట్లు తెలిపారు. రూ. 250 దరఖాస్తు రుసుం కాగా, డీడీతో వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏయూ.ఈడీయు.ఐఎన్ వెబ్ సైట్ లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు.

'ప్రత్యేక తరగతులు నిర్వహించాలి'

పలాస: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలకు జగనన్న విద్యా కానుక కిట్లు వంద శాతం అందే విధంగా చూడాలని ఉప విద్యాశాఖాధికారి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో శత శాతం ప్రవేశాలు జరిగే విధంగా చూడాలన్నారు. అలాగే నూతనంగా ప్రారంభం కాబోతున్న బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలు జరిగే విధంగా చూడాలని పగడాలమ్మ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆర్డీఓ బి.శాంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో ఆడ, మగ అనే లింగభేదం ఉండరాదని రెవెన్యూ డివిజినల్ అధికారి బి.శాంతి అన్నారు. శ్రీకాకుళం ఆర్డీఓ చాంబర్‌లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం రెవెన్యూ డివిజినల్ అధికారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలలో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రచారానికి తన వంతు రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.అనురాధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్వీ రమణ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మంత్రి వెంకటస్వామి, ఎన్జీఓ రమణ మూర్తి, వన్ టౌన్ ఎస్ఐ గణేష్, డిప్యూటీ డెమోలు వెంకటేశ్వర రావు, కళావతి, మోహిని తదితరులు పాల్గొన్నారు.

'జూన్ 12 నాటికి పనులు పూర్తి చేయాలి'

అరసవల్లి: జిల్లాలో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, వచ్చే నెల 12 నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన నాడు–నేడు సంబంధిత అధికారులతో పాటు గృహనిర్మాణ శాఖాధికారులతో కూడా వేర్వేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ముందుగా నాడు–నేడు పనుల సమీక్షలో మాట్లాడుతూ లక్ష్యాలను పూర్తి చేసే విషయంలో ప్రగతి కనబరచని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిధులున్నా పనిచేయించడంతో నిర్లక్ష్యం వహించిన కారణంగా హిరమండలం ఎంఈఓ పనితీరు బాగోలేదని..వెంటనే సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించారు.

గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టండి

జిల్లాలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం ఆ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అర్హులుగా గుర్తించి ఇళ్లను కేటాయించినప్పటికీ.. ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టని వారిని వెంటనే గుర్తించి, వారి స్థానాల్లో కొత్త అర్హులకు చోటు కల్పించాలని సూచించారు. ఈ కొత్త వారి ఎంపిక విషయంలో పక్కాగా పనిచేయాలన్నారు. అలాగే గృహనిర్మాణాలు జరుగుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన స్పీడుగా జరగాలని ఆదేశించారు. ఈ శాఖలో పనుల ప్రగతి చూపని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, బూర్జ, టెక్కలి ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రానున్న 45 రోజుల్లోగా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

గడప గడపలో భద్రత

కుంటిభద్ర ప్రత్యేకత



కుంటిభద్ర గ్రామం

- ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పనలో ఆదర్శంగా నిలుస్తున్న కుంటిభద్ర
- ప్రతి మూడిళ్లకు ఒక ప్రభుత్వ ఉద్యోగి
- స్వయం ఉపాధిలోనూ వారిది అందెవేసిన చేయి
- మారుతున్న గ్రామ రూపురేఖలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆ గ్రామంలో 800 గడపలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 150 కుపైనే. వెనుకబడిన కొత్తూరు మండలంలోని కుంటిభద్ర అనే కుగ్రామంలోని గణాంకాలివి. ఇక్కడ యువత ఊరి తీరును మారుస్తున్నారు. కష్టపడి కొలువులు సాధిస్తూ వెనుకబాటు ముద్రను చెరిపేస్తున్నారు. తమ కాళ్లపై నిలబడి ఉద్యోగం సాధించడం, లేదంటే స్వయం ఉపాధి చూసుకుంటూ ఇక్కడి యువత ఆదర్శంగా నిలుస్తున్నారు.

కుంటిభద్రలో ఏ ఒక్కరూ ఖాళీగా ఉండరు. ప్రతి మూడిళ్లకు ఒక ఉద్యోగస్తుడు కనిపిస్తాడు. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. చదువు పూర్తయి వారు ఉద్యోగ అన్వేషణలో పడి సత్తా చాటుతున్నారు. ఎవరికైనా ఉద్యోగం రాకపోతే దాని కోసం సమయాన్ని వృథా చేసుకోరు. స్వయం ఉపాధి పొందేలా తయారవుతున్నారు. ఏదో ఒక రంగంపై అవగాహన పెంచుకుని ఉపాధి పొందుతున్నారు. దాదాపు 800 గడపలున్న గ్రామంలో 150కిపైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కొలువుల్లో కుంటిభద్ర..

ఈ గ్రామం చిన్నదైనప్పటికీ ఆదర్శంలో పెద్దదిగా నిలిచింది. పోటీ ప్రపంచాన్ని తట్టుకుని ముందుకు సాగుతోంది. తల్లిదండ్రుల మాటలను ధిక్కరించకుండా, వారి ఆశలను నిజం చేస్తూ అక్కడి యువత తమ భవిష్యత్‌కు సరికొత్త బాటలు వేసుకుంటోంది. ఎవరి మీదా ఆధారపడకుండా ఉద్యోగాలు సాధించడమే కాకుండా స్వయంగా కష్టపడి ఉపాధి అవకాశాలను పెంచుకుంటోంది. ఇక్కడి యువత దాదాపు ప్రతి శాఖలోనూ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. దాదాపు 12 మంది ఉపాధ్యాయు లుగా పనిచేస్తుంటే, 14 మంది వరకు రైల్వే ఉద్యోగులగా విధులు నిర్వర్తిస్తున్నారు. 10మందికి పైగా బ్యాంకు ఉద్యోగులుండగా, రెవెన్యూ, సచివాలయం ఉద్యోగులు 10మందికి పైగా ఉన్నారు. డిఫెన్స్ రంగంలోనైతే గ్రామంలో 60 మంది వరకు పనిచేస్తున్నారు. వైద్య రంగంలో ముగ్గురు, గ్రూపు–2 కొలు వుల్లో ఇద్దరు, పోలీసు, ఇతరత్రా ఉద్యోగాల్లో మరికొంతమంది పనిచేస్తున్నారు. దాదాపు 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ గ్రామంలో ఉన్నారు.





స్వయం ఉపాధిలోనూ..



కుంటిభద్ర గ్రామం స్వయం ఉపాధిలోనూ తిరుగులేకుండా ఉంది. అక్కడున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే నిరాశతో కుమిలిపోరు. తమ కాళ్లపై నిలబడి వ్యక్తిగత నైపుణ్యం సాధించి ఉపాధి పొందుతున్నారు. 30మందికి పైగా బోర్ మెకానిక్, ప్లంబర్లుగా పనిచేస్తున్నారు. మరో 10మంది వరకు ఎలక్ట్రీషియన్లుగా కొనసాగుతున్నారు. దాదాపు 50మంది వరకు రాష్ట్ర స్థాయి కళాకారులుగా ప్రదర్శనలిచ్చి ఉపాధి పొందుతున్నారు. మరో 150మంది వరకు నాటు బళ్లు తయారు చేసుకుని, భవన నిర్మాణాలకు ఇసుక సరఫరా చేసి సంపాదించుకుంటున్నారు. మరికొంతమందైతే కొత్తూరు, చుట్టూ పక్కల ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు పెట్టి స్వయం ఉపాధి పొందు తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రంగా ల్లో ఇక్కడ యువత సత్తా చాటి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



పోటీ తత్వం ఉంది

గ్రామంలోని యువతకు పోటీతత్వం ఉంది. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని చూసి మేము కూడా అంతకంటే ఉన్నతమైన ఉద్యోగం సాధించాలన్న పోటీ ఉంది. దీని వల్లనే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అందులో నేనూ ఉన్నాను.

– చెదవరపు జయలక్ష్మి
ఎస్జీటీ, కుంటిభద్ర గ్రామం



కష్టపడే తత్వం అందరిలో ఉంది..

మా గ్రామంలోని యువతది కష్టపడే తత్వం. ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. తల్లిదండ్రుల మాటలు పిల్లలు వినడం వల్ల మంచి భవిష్యత్‌ను అందుకుంటున్నారు. ఎవరి మీదా ఆధారపడకుండా స్వయంగా కష్టపడాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు.

– ప్రశాంత్ కుమార్ పాడి,
ఏసీటీఓ విశాఖపట్నం, కుంటిభద్ర గ్రామం

యువతలో చైతన్యం కోసం జాగృతి

- మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ రాధిక
- వర్చువల్ విధానంలో హాజరైన పీవీ సింధు



జాగృతి కార్యక్రమం కోసం మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : చట్టాలపై అవగాహన లేకనే యువత నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మహిళల భద్రత, ప్రజా పరిరక్షణకు ఎన్నో వినూత్న ఆవిష్కరణలు, కార్యక్రమాలు చేపట్టిన ఎస్పీ రాధిక యువతను జాగృతపరిచే మరో అపురూప కార్యక్రమం 'జాగృతి–యువత కోసం' అనే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అరసవిల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో 15–25 ఏళ్ల లోపు వయసున్న 12 వేల మందికి వివిధ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, పోలీసుల విధులపై ఐదు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీనియర్ అధికారులు, నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో అధికారులు తెలిపిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు.

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ జాగృతి కార్యక్రమంలో శిక్షణ పొందిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా వివిధ అంశాలపై తర్ఫీదునిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి భవిష్యత్‌వైపు యువత దృష్టి మళ్లించాలన్నారు.

నేర నియంత్రణకు కృషి: పీవీ సింధు



వర్చువల్ విధానం ద్వారా సందేశాన్నిస్తున్న పీవీ సింధు

శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ యువత కోసం మంచి కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీన్ని సద్వినియోగం చేసుకుని నేర నియంత్రణకు అంతా కృషి చేయాలని బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు పేర్కొన్నారు. జీవితంలో ప్రతి అంశాన్ని చాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈమెతో పాటు సినీ ప్రముఖులు సుహాస్, కిరణ్ కుమార్‌లు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొబైల్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చా రు. అనంతరం ఐదు రోజుల శిక్షణ కాలానికి సంబంధించిన అంశాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఎస్పీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్‌కుమార్, సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, డీఎస్పీలు శృతి, బాలరాజు, శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎన్ అప్పన్న, సీఐలు పప్పల శ్రీనివాసరావు, ఎస్.వి.రమణ, సన్యాసి నాయుడు, ఎస్ఐలు గణేష్, విజయ్‌కుమార్, సందీప్‌కుమార్, మహిళా పోలీసులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రమాదం లేకుండా రోడ్డు



రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, వంశధార ఎస్ఈ తిరుమలరావు

టెక్కలి: మూలపేట పోర్టుకు టెక్కలి జాతీయ రహదారి నుంచి వేస్తున్న రోడ్డు వల్ల ప్రభావిత ప్రాంతాలకు ఎలాంటి ముంపు ప్రమాదం లేకుండా చూసుకుంటామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పోర్టు రోడ్డు వల్ల ప్రభావిత గ్రామాల్లో పంట పొలాలకు ముంపు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటన చేయాలని ఇటీవల ప్రభావిత గ్రామాల రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. దీంతో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావుతో పాటు రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, పోర్టు నిర్మాణ కాంట్రాక్టర్ సిబ్బందితో కలిసి మంగళవారం టెక్కలి సమీపంలో పోర్టు రోడ్డు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతంలో ఉన్న మదన గోపాలసాగరం నుంచి వరదల సమయాల్లో దిగువ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ముంపు ప్రమాదం వస్తోందని గుర్తు చేశారు. ఇప్పుడు పోర్టు కోసం భారీగా రోడ్డు వేస్తే ఆ ప్రమాదం మరింత జటిలంగా మారే అవకాశం ఉందని ఆయా రైతులు పేర్కొన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పోర్టు నిర్మాణం చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములకు పుష్కలంగా సాగునీరు అందే విధంగా సంబంధిత వంశధార అధికారులు కల్వర్టులు నిర్మిస్తారని పేర్కొన్నారు. అనంతరం రైతుల కోరిక మేరకు మదనగోపాల సాగరాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో వంశధార ఈఈ కె.శ్రీకాంత్, తహసీల్దారు బి.గిరి తో పాటు ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నారు.

15,281 మందికి రూ.15.28 కోట్లు

- మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు విడుదల
- ఒక్కో లబ్ధిదారునికి రూ.10వేలు భృతి



లబ్ధిదారులకు వాహనాలను అందజేస్తున్న దృశ్యం



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పంపిణీ చేసింది. వరుసగా ఐదో సారి కూడా చెప్పినట్టుగానే ఒక్కో లబ్ధిదారునికి రూ.10వేలు జీవన భృతిని విడుదల చేసింది. బాపట్ల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఆయన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 15,281 మందికి రూ.15.28 కోట్ల మేర లబ్ధి కలుగుతుందన్నారు. మంచినీళ్లపేట, మూలపేట, తదితర ప్రాంతాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత భూముల్లో చేపల చెరువులకు అనుమతులు తీసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో రణస్థలం మండలంలో 2427 మంది అర్హత గల మత్స్యకారులు ఉండగా రూ.2.42 కోట్లు, ఎచ్చెర్ల మండలంలో 1758 మందికి రూ.1.75 కోట్లు, శ్రీకాకుళం మండలంలో 980 మందికి రూ.98 లక్షలు, గార మండలంలో 1936 మందికి రూ.1.93 కోట్లు, పోలాకి మండలంలో 1404 మందికి రూ.1.40కోట్లు, సంతబొమ్మాళి మండలంలో 1301 మందికి రూ.1.30 కోట్లు, వజ్రపుకొత్తూరు మండలంలో 1851 మందికి రూ.1.85 కోట్లు, మందస మండలంలో 253 మందికి రూ.25.3లక్షలు, సోంపేట మండలంలో 1299 మందికి రూ.1.29 కోట్లు, కవిటి మండలంలో 1663 మందికి రూ.1.66 కోట్లు, ఇచ్ఛాపురం మండలంలో 424 మందికి రూ.42.4 లక్షలు పంపిణీ చేసినట్లు వివరించారు.

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ మత్స్యకారుల్లో వలసల నివారణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. జిల్లా సముద్ర తీర ప్రాంతాన్ని మత్స్యకారులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు మాట్లాడుతూ మత్స్యకారులు వేటలో మృతి చెందితే ప్రభుత్వం నుంచి రూ. పది లక్షలు అందిస్తున్నట్లు వివరించారు.

జాతీయ మత్స్యకార సంఘం కార్యదర్శి సూరాడ రాజారావు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాల గురించి వివరించారు. సంతబొమ్మాళి మండలం జెడ్పీటీసీ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీర ప్రాంతం ఎక్కువగా ఉందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకార భృతి 5వ విడత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ బోర్డు అధ్యక్షుడు నేతాజీ, ఆఫ్కాస్ డైరెక్టర్ తోటమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, డీసీసీబీ సీఈఓ వర ప్రసాదరావు, ఆఫ్కాస్ అధ్యక్షులు గోవిందరావు, సంతబొమ్మాళి మండలం జెడ్పీటీసీ రెడ్డి, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ మత్స్యకార భరోసా నమూనా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. కార్యక్రమం అనంతరం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ఫిషర్ వాహనం ద్వారా లైవ్ ఫిష్ రవాణా చేసుకునేందుకు వాహనాలను సబ్సిడీపై కలెక్టర్ శ్రీ కేష్ బి.లాఠకర్ రెండు యూనిట్లకు పంపిణీ చేశారు. ఇందులో ఒక్కో యూనిట్ విలువ రూ.13,29,798లు కాగా ఇందులో రాయితీ రూ.5,31,920 కాగా లబ్ధిదారుని వాటా రూ.1,99,878, బ్యాంకు లోన్ రూ.5,98,000 ఉన్నట్లు తెలిపారు.

ఈదురు గాలుల బీభత్సం



ఈదురు గాలులకు నేలకూలిన గేట్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఇచ్ఛాపురం: అనుకోకుండా వచ్చిన ఈదురుగాలులు ఇచ్ఛాపురంలో బీభత్సం సృష్టించాయి. మంగళవారం ఉదయం నుంచి ఎండ తాపానికి తట్టుకోలేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. అంతా ఆనందించేలోపే ఈదురు గాలులు భయపెట్టేశాయి. బెల్లుపడ కాలనీలో కె.పాపారావు ఇంటి గోడ కూలి అతని ద్విచక్రవాహనం ధ్వంసమైంది. తారకేశ్వర వీధిలో పాండవ మోహిని ఇంటి రేకు గాలికి ఎగిరి తలపై పడడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా 30 కుట్లు పడ్డాయి. గ్రామదేవత ఉత్సవాల కోసం ఏర్పాటుచేసిన గేట్లు కూలిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తహసీల్దార్ గురుప్రసాద్, ఆర్ఐ శ్రవణ్ సిబ్బంది ఈదురు గాలులకు గాయాలపాలైన మహిళను పరామర్శించి వివరాలు సేకరించారు.

జి.సిగడాంలో వడగళ్ల వాన



పున్నాంలో వడగాళ్ల వర్షం (ఇన్‌సెట్లో) వడగళ్లు

జి.సిగడాం: మండలం పరిధిలో పున్నాం, గెడ్డకంచరాం, బాతువ, డీఆర్‌వలస, ముషినివలస, బూటుపేట గ్రామాల్లో మంగళవారం వడగళ్ల వాన కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మేఘాలు కమ్ముకుని గాలులతో కూడిన వర్షం పడింది. వడగళ్లు కూడా పడడంతో స్థానికులు ఉపశమనం చెందారు.






శ్రీకాకుళం నగరంలో..

● వేడి దాడి

రెండురోజులుగా భానుడు భగభగలాడుతున్నాడు. జిల్లాలో మంగళవారం అత్యధికంగా శ్రీకాకుళంలో 40 డిగ్రీలు, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, కొత్తూరు రణస్థలంలో కూడా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఎండలు మండిపోయాయి. వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో నానా ఇక్కట్లు పడ్డారు. –ఆమదాలవలస ,

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



క్లుప్తంగా

కారు బోల్తా


బోల్తాపడిన కారు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన మంగళవారం కారు బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తుండగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్, మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు, హైవే సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు.

అరబిందో ఫార్మాలో ఉద్యోగాలకు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అరబిందో ఫార్మా కంపెనీలో 250 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రొడక్షన్, క్యూసీ, ఇంజినీరింగ్, తదితర ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ పాస్/ఫెయిల్, డిప్లొమో, కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎంఫార్మసీ, బీఫార్మసీ, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పాస్/ఫెయిల్, ఐటీఐ మెకానికల్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ తదితర విద్యార్హతలు కలిగి 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు డీఎల్‌టీసీ శిక్షణా సంస్థ వద్దకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని చవితిపేట సమీపంలో పెద్దచెరువులో మునిగి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడు నీలంరంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు వారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కోరారు.

సజావుగా ఏపీ ఈఏపీసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (ఏపీ ఈఏపీ సెట్- 2023 పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం మూడు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 190 మందికి 184 మంది, రెండో షిఫ్టులో 190 మందికి 183 మంది, ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 190 మందికి 184 మంది, రెండో షిఫ్టులో 190 మందికి 185 మంది, టెక్కలిలోని ఐతం కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 230 మందికి 217 మంది, రెండో షిఫ్టులో 230 మందికి 220 మంది హాజరయ్యారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి


సింహాచలం (ఫైల్)

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ సింహాచలం (63) వడదెబ్బకు గురై మంగళవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న సాగరం చెరువు వద్ద చేపల కొనుగోలుకు వెళ్లి ఇంటి వచ్చాడు. వెంటనే స్పృహ తప్పి కుప్పకూలిపోవడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. సిబ్బంది వచ్చి వాహనంలోకి ఎక్కించేసరికే సింహాచలం మృతిచెందాడు. మృతునికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800-00
బంగారం(22సి. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

ఉపాధికి చిరునామా..
పారిశ్రామిక శిక్షణ

- ఐటీఐల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఆహ్వానం
- అందుబాటులో 3676 సీట్లు

ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్	మే 12
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	మే 13
దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ	జూన్ 6
సహాయ కేంద్రాల్లో పరిశీలన చివరి తేదీ	జూన్ 6
సహాయ కేంద్రాలు	ఎచ్చెర్ల ఐటీఐ, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాస డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ
ప్రభుత్వ ఐటీఐలు	మూడు (ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాస)
ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు	640
ప్రైవేట్ ఐటీఐలు	20
ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు	3037
మొత్తం 23 ఐటీఐల్లో సీట్లు	3676
వెబ్‌సైట్	ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్



ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం


ప్రయోగ పరీక్షల్లో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు త్వరగా ఉపాధి పొందే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. ప్రధానంగా జిల్లా విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్‌తో పాటు ఐటీఐ చదివేందుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తారు. కోర్సు విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులు అప్రెంటీస్ తర్వాత 18 ఏళ్లు దాటాక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. మరోవైపు విద్యుత్, రైల్వే, రక్షణ శాఖ వంటి వాటిల్లో సైతం ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. చదువులో ఒత్తిడి ఉండదు. అయితే స్కిల్స్ తప్పనిసరి. నైపుణ్యం ఉన్న విద్యార్థులకు తప్పకుండా ఉపాధి లభిస్తుంది. మరోవైపు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సైతం ఐటీఐలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఈ కోర్సు దోహదపడుతుంది.

వివిధ ట్రేడుల్లో శిక్షణ..

- జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 3676 సీట్లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి ఉన్న ట్రేడులు నిర్వహిస్తున్నారు. కొన్ని ట్రేడులు 7వ తరగతి విద్యార్హతతో సైతం నిర్వహిస్తున్నారు.
- రెండేళ్ల కోర్సులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్.
- ఏడాది కోర్సులు: డీజిల్ మెకానికల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ప్రోగ్రాం అసిస్టెంట్
- ఆసక్తిగల విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకు వెళ్లి దరఖాస్తులు పరిశీలించు కోవాలి. తప్పులు ఉంటే సరిచేస్తారు. దరఖాస్తులు పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. జూన్‌లో షెడ్యూల్ ఖరారు చేశారు. జూలైలోపు ప్రవేశాల ప్రక్రియ పూర్తిచేస్తారు. ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

పరిశీలనకు వెళ్లాలి..



ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో చేరవచ్చు. షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో జూన్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలనకు సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరుకావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థి మొబైల్ నంబర్‌కు పంపిస్తాం. సందేహాలు ఉంటే ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించవచ్చు.మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ బట్టి ప్రవేశాలు లభిస్తాయి.

– కె.ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ, జిల్లా ప్రవేశాల సమన్వయకర్త

నేర రహిత సమాజంతోనే ప్రగతి


మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: నేర రహిత సమాజంతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 'జాగృతి -యువత కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత నేరాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్య అందుబాటులో ఉందని, అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువత జాతి సంపదని చెప్పారు. వ్యక్తిగత క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎస్సై వి.సత్యనారాయణ మాట్లాడుతూ నేరాలకు, మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. కేసుల్లో ఇరుక్కుపోతే విలువైన జీవితం నష్టపోతారని చెప్పారు.

గిరిశిఖర గ్రామాల్లో ఇంటికే రేషన్ సరుకులు


వీరన్నపేటలో గిరిజనులతో మాటాడుతున్న పౌరసరఫరాల అధికారి వెంకటరమణ

మెళియాపుట్టి: కొండలపై ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వ రేషన్ సరుకులను ఇళ్లకే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మెళియాపుట్టి మండలంలోని గిరిశిఖర గ్రామాలైన కేరాసింగి, గూడ, చందనగిరి, గొట్టిపల్లి, వీరన్నపేట, ముత్యాలబొంతు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు ఎండీయూ వాహనం కొంతవరకే వెళ్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయం రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డిశాంతి సైతం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. జూన్ నెల రేషన్ సరుకులను ట్రాక్టర్ల ద్వారా అయినా కొండపైకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేలిముద్రలు పడని గిరిజనులు ఇకపై దిగులు చెందాల్సిన అవసరంలేదని, వారి నామినీ వేలిముద్ర ద్వారా సరుకులు అందించేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. వచ్చే నెల నుంచి అదనంగా రెండు కిలోల గోధుమలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సరోజిని, డీటీ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం


బి.వీరభద్రరావు, జిల్లా అగ్నిమాపక అధికారి

శ్రీకాకుళం క్రైమ్ : రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నందున అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.వీరభద్రరావు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అడవుల్లో కార్చిచ్చులు జరిగే అవకాశమున్నందున మేకలు, పశువుల పెంపకందారులు, వేటకు వెళ్లేవారు, వంటచెరకు తెచ్చుకునే వారిని వలంటీర్లు, ఫారెస్టు బీట్ సిబ్బంది అప్రమత్తం చేయాలన్నారు. సిగరెట్లు, బీడీలు, అగ్గిపెట్టె వంటివి ఉన్నాయా లేదా అన్నది తనిఖీ చేస్తే మంచిదన్నారు. బొగ్గు కాల్చేవారు, పోడు వ్యవసాయం చేసేవారు అడవులకు వెళ్లే మార్గంలో చెత్తా చెదారాలున్న చోట నిప్పు వెలిగించవద్దని చెప్పారు. ఫైర్ ఇంజిన్లు వెళ్లలేని చోటకు ఫైర్ బీట్స్ సహాయంతో మంటలు ఆర్పేలా సన్నద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ వాడకం ఎక్కువగా వినియోగిస్తున్నందున షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదాలు సంభవించే అవకాశముందని, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ముగిసిన జూడో ఎంపిక పోటీలు


క్రీడాకారుల ప్రతిభను పరిశీలిస్తున్న సెలక్షన్ కమిటీ ప్రతినిధులు


శ్రీకాకుళం న్యూకాలనీ: జూడో ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రతిభ చాటుకున్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ చరణ్ ఆధ్వర్యంలో జిల్లా జూడో సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి పైడి సునీత, జిల్లా డీఎస్‌ఏ శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ పర్యవేక్షణలో ఈ ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 18, 19 తేదీలలో అనంతపురం జిల్లా కల్యాణదుర్గం వేదికగా జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 జూడో చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈవో బి.వి.ప్రసాదరావు, చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సీనియర్ అథ్లెట్ బిందు, సీనియర్ జూడో క్రీడాకారులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


బోల్తాపడిన కంటైనర్

ఇచ్ఛాపురం: ఈదుపురం- బెల్లుపడ కూడలిలో జాతీయ రహదారిపై మంగళవారం బరంపురం నుంచి పలాస వైపు వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోకలు చేయకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ విషయమై పట్టణ పోలీసుల వద్ద సంప్రదించగా ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీకి గుర్తింపు


కండక్టర్, డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం


కాశీబుగ్గ : ఆర్టీసీ బస్సులో రూ.35 లక్షల విలువైన 55 తులాల బంగారం మర్చిపోయిన బాధితురాలికి సిబ్బంది తిరిగి అందజేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పలాస డిపోలో మంగళవారం కండక్టర్ ఆర్.వి.రావు, డ్రైవర్ ఎస్‌హెచ్ ప్రసాద్‌లను శాఖాపరమైన మెమెంటో, సర్టిఫికెట్ అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సుఖం, సురక్షితం, ప్రయాణికుల లగేజీ భద్రమని చెప్పారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల ప్రతినిధులు, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దాడ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల : జాతీయ స్థాయిలో నిర్వహించిన సెమ్స్ పోటీ పరీక్షల్లో ముద్దాడ పాఠశాలకు చెందిన పెల్లాటి నితిన్ జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన బలివాడ మంజులకు రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు, నకిరి గాయిత్రికి ఐదు, అంబటి చరణ్‌కు ఆరు, ముద్దాడ తేజస్వరికి ఎనిమిది, కాపురెడ్డి రాజుకు తొమ్మిదో ర్యాంకు వచ్చిందని చెప్పారు. వీరిని మంగళవారం ముద్దాడలో జరిగిన పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమంలో భాగంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ సభ్యులు బెండు రామారావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సాయంత్రపు ఓపీ

- వారం రోజుల్లో ప్రారంభం
- సన్నాహాలు చేస్తున్న అధికారులు


GOVERNMENT OF ANDHRA PRADESH
OFFICE OF THE DIRECTOR OF MEDICAL EDUCATION AP
VIJAYAWADA

ప్రభుత్వ ఉత్తర్వు

శ్రీకాకుళం : రిమ్స్‌లో త్వరలో సాయంత్రం వేళ ఓపీ(ఔట్ పేషెంట్) విభాగం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వారం రోజుల్లో ఓపీ ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఓపీ నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోధనాసుపత్రుల్లో ఇక నుంచి సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఓపీ వేళలు నిర్వహించనుండటంతో జిల్లా కేంద్రానికి వైద్యం కోసం వచ్చే రోగులకు ఊరట లభించనుంది. ఇదివరకు ఉదయం వచ్చే రోగులు ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షలు చేయించుకుని వాటి రిపోర్టు వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలు దాటేది. అప్పటికే సంబంధిత వైద్యులు వెళ్లిపోయేవారు. దీంతో రోగులు మరుసటి రోజు వ్యయప్రయాసలకోర్చి మళ్లీ రావాల్సివచ్చేది. రోగుల ఇక్కట్లు గమనించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో వారికి వరమైంది.

ఇన్‌చార్జిగా ఆర్‌ఎంఓ..



ఆర్ఎంఓ ఇన్‌చార్జిగా సాయంత్రపు ఓపీని వారం రోజుల్లో ప్రారంభిస్తాం. ప్రతి వైద్యుడు సాయంత్ర ఓపీకి హాజరుకావాల్సిందే. ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలి. తాజా నిర్ణయంతో ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చేవారి సంఖ్య పెరిగే వీలుంది.

– డాక్టర్ స్వామినాయుడు, సూపరింటెండెంట్, రిమ్స్

చికిత్స పొందుతూ వివాహిత మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కెల్లవీధిలో నివాసముంటున్న ఓ వివాహిత రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. కానుకుర్తి వీధిలో నివాసముంటున్న బండి జయమ్మ, చిన్నారావు దంపతుల కుమార్తె దేవి(34)ని కృష్ణాపార్కుకు చెందిన జమ్మూ లక్ష్మణరావుతో పదహారేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి 15 ఏళ్ల కుమారుడున్నాడు. కొంతకాలంగా వీరు కెల్లవీధిలో నివాసముంటున్నారు. లక్ష్మణరావు ప్లంబింగ్ చేస్తుండేవాడు. మద్యానికి బానిసయ్యాడు. కుమారుడి భవిష్యత్తు కోసం డబ్బులు దాయాలని చెప్పినా భర్త తీరు మారకపోవడంతో మనస్తాపానికి గురైన దేవి సోమవారం సాయంత్రం సూపర్ వాస్మల్-33 తాగేయడంతో బంధువులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. దేవి తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కొత్తూరు: కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామం వద్ద ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం చిన్నభగ్గ గ్రామానికి చెందిన పసుపురెడ్డి అభిషేక్(16) శ్రీకాకుళంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అభిషేక్ చిన్నబగ్గ నుంచి బైక్‌పై కొత్తూరు వస్తుండగా కర్లెమ్మ గ్రామం సమీపంలో ప్రమాదానికి గురై గాయపడ్డాడు. స్థానికులు 108లో కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తీసుకెళ్లగా అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.గోవిందరావు చెప్పారు. తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజయదుర్గమ్మకు లక్ష పుష్పార్చన


నగరంలోని నానుబాలువీధిలో విజయదుర్గ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణికుమార్ శర్మల ఆధ్వర్యంలో కనకాంబరాలతో లక్ష పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం అర్బన్

పరిసరాల పరిశుభ్రత అందరిబాధ్యత

శ్రీకాకుళం పాతబస్టాండ్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, కాలుష్యాన్ని నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్) కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. డే - నైట్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఏర్పాటుచేసిన సైకిల్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య నియంత్రణకు తోడ్పాటు నిద్దాం అంటూ అధికారులు, పర్యావరణ ప్రేమికులతో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ భాగంగా ఈ నెల 21న కళింగపట్నంలో బీచ్ క్లీనింగ్ చేపడతామన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.శంకర్ నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కైలాసరావు, గనులు, భూగర్భ వనరుల శాఖాధికారి ఎస్.కె.వి.సత్యనారాయణ, సంఘ సేవకులు డాక్టర్ మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాల ఒడిలో..



సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు మంగళవారం ఒకే వేదికపై కలిశారు. ఆనాటి జ్ఞాపికలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

- సారవకోట